# రాముని వైరధర్మము

రాముడు ధర్మస్వరూపుడగుట వలన వైరభావము కూడ ఆయనలో ధర్మబద్ధమై ఉన్నది. తనను శత్రువుగా, ప్రతికూలునిగా తలంచువారు తనవారైనచో వారిపై రామునకు వైరభావమే లేదు. వారు తనపై వైరమును ప్రకటించినచో దానిని నిస్వార్థ ప్రేమతో, త్యాగశీలముతో ఎదుర్కొనును. ఎదుర్కొని వారిలోని వైరమును, ద్వేషమును నిర్వీర్యము చేసి శాంతింపజేయును. ధర్మదృష్టితో వారు విషయ దర్శనము చేయునట్లుగా వారిబుద్ధిని ప్రేరణ చేయును. ఈ విధముగా తనలో వైరభావము లేకపోవుటయే గాక, వారిలో కూడ అట్టి భావము లేకుండ చేయుటకు తన ఆచరణము ద్వారా యత్నించును. ఇతరులు కూడ వారి అధర్మాచరణము వలన తనకు శత్రువులగుదురు కాని వారిపై రామునకు వ్యక్తిగత ద్వేషములేదు. వారిని కూడా అధర్మాచరణమునకు శిక్షించి, పాపరహితులను చేసి స్వర్గాది పుణ్యలోకములను పొందుటకు వారిని యోగ్యులనుగా చేయును. వారు శిక్షను పొంది విగతకల్మషులయిన పిమ్మట వారు తనకు ఆత్మీయులేగాని, శత్రువులు కారు.

దశరథుడు రామయౌవరాజ్యాభిషేకము ప్రకటించిన పిమ్మట రాణివాసములో కలతలు కలిగినవి. అంతఃపుర స్త్రీలందరి కంటె దశరథునకు ఇష్టురాలైన కైకేయి రాజును మాటతోబంధించి, రాజ్యమునకై ఆయనను ఆయాస పరిచినది. రాజునకు ప్రియతముడయిన రామునిని ఆలంబనము చేసికొని తన స్థానవృద్ధిని కౌసల్య ఆశించినది. తన కోరిక విఫలము కాగా, విప్లవము ద్వారా రాజ్యమును సాధింతునని లక్ష్మణుని ఉద్యమమునకు కౌసల్య సూత్రప్రాయముగా అంగీకరించినది. తాను అంగీకరించి, దానికి రాముని ఆమోదమును కాంక్షించినది–"నీవు తమ్ముడు లక్ష్మణుని మాటలు వింటివి గదా! నీకు అది రుచించినచో తర్వాత చేయదగిన పనిని చేయుము"

**భ్రాతస్తే వదతః పుత్ర! లక్ష్మణస్య శ్రుతం త్వయా।**
**యదత్రానంతరకార్యం కురుష్వ యది రోచతే॥** అయో. 21-20

అత్తను అనుసరించు సీత కైకేయీ భరతులను శత్రువులుగనే తలచి రాముని ప్రవాసకాలమున వారి ఆశ్రయములో ఉండుటకు నిరాకరించినది.

**అథ మామేవమవ్యగ్రాం వనం నైవ న యిష్యసి।**
**విషమద్యైవ పాస్యామి మావిశం ద్విషతాం వశమ్॥** (అయో. 30-39)

"నీవు నన్ను విడిచి అరణ్యమునకు వెళ్ళినచో ఇప్పుడే విషమును సేవింతును గాని, శత్రువులవశమందుండను". ఇట్లు రాజ్యమునకై, రాజు ప్రాపకమునకై రాణివాసము రెండు పక్షములయి మాత్సర్యద్వేషములతో కుములుచున్నది.

రాముడు దశరథునివలె కామాసక్తుడుగాని, కైకేయీ కౌసల్యలవలె స్వార్థపరుడై రాజ్యాసక్తుడుకాని, లక్ష్మణునివలె క్రోధావేశపరుడుగాని అయినచో సర్వనాశనమయ్యెడిది. కాని రాముడు తన ఋషిశీలముతో రాజవంశమును, రాజ్యమును ప్రమాదము నుండి కాపాడినాడు. స్వల్పకాలిక మానవజీవితములో అధర్మరూప సంపదను కోరరాదనియు, కేవలార్థపరులు లోకమునకు ద్వేష్యులగుదురనియు, అందువలన ఋషిలాంటి తనకు రాజ్యాసక్తి లేదనియు ప్రకటించి, రాజ్యమును పరిత్యజించినాడు. ఈ పరిత్యజించుట–తల్లిని సంతోషింపజేయుటకు, తండ్రిని సత్యప్రతిజ్ఞునిగా నిల్పుటకు, తమ్ముని సుఖింపచేయుటకు అగుటవలన–రామునకు ఆనందకరముగా ఉన్నది. వనవాసము విధించిన తండ్రిపై గాని, నిర్దేశించిన తల్లి కైకేయిపై గాని, రామునకు ద్వేషము లేదు.

"తల్లిదండ్రులు గురువు కనిపించి పూజలందుకొనే దైవతములు. వారినికాదని కనిపించని దైవమును ఆరాధించుటెట్లు?" (అయో. 30-33). ఇట్లు తల్లిదండ్రులను రాముడు ప్రత్యక్ష దైవతములుగా తలంచినాడు. వారి మాటను పాటించుట రామునకు ధర్మ ము. ఆ ధర్మచరణములో రామునకు సుఖమున్నది. కావున వారిపై రామునకు కోపము, ద్వేషము లేవు. వాని స్థానమున ప్రేమను, త్యాగమును స్థాపించుకొనినాడు. ఇక సోదరులు తనకు ప్రాణసమానులు. వారికొఱకే రాముడు సంపదలను కోరునది. "వారికి కాని సంపదలు తనకుంటే, వానిని అగ్ని భస్మము చేయుగాక!" అనినాడు (అయో. 97-8). విప్లవము ద్వారా రా

జ్యమును సాధింతుననిన లక్ష్మణునితో 'బంధుమిత్రుల నాశముతో లభించు సంపద విషముతో సమానము. నేను దానిని స్వీకరింపను'

**యద్ద్రవ్యం బాంధవానాం వా మిత్రాణాం వా క్షయే భవేత్।**

**నాఽహం తత్ప్రతిగృహ్ణీయాం భక్షాన్విషకృతానివ॥** – అయో. 97-4

అని చెప్పి, అది అనార్య రాజధర్మమని, దానిని త్యజింపుమని, ధర్మాసక్తుడవు కమ్మని లక్ష్మణుని కోరినాడు. పతిసేవతో, దేవతా పూజాదికముతో తన రాకను ప్రతిక్షింపుమని తల్లిని వేడుకొనినాడు. ఆమెను ఊరడించి, ఆమె ఆలోచనను ధర్మాభిముఖముగా మార్చినాడు. సీత త్రికరణశుద్ధిగా తనను అనుసరించుటకు సిద్ధముగా ఉన్నదని ఎఱిగిన తర్వాత ఆమె దుఃఖమును, కోపమును పోగొట్టి, ఊరడించి, తనతో ఆమె వనవాసము చేయుటకు అంగీకరించినాడు. ఇట్లు పరస్పరద్వేషములతో, అసూయలతో సర్వనాశనమునకు సిద్ధముగా ఉన్న రాజకుటుంబమును తన త్యాగనిరతి, నిర్వైరభావముతో సముద్ధరించినాడు.

తనకు వైరభావము లేకపోవుటయే గాక, తనవారిలో పరస్పర ద్వేషము, వైరము లుండరాదని రాముడు తలంచును. రామాభిషేకమును భగ్నముచేసిన కైకేయిని, (రామపట్టభంగము ఇష్టమైనచో) ఆమె కుమారునిని, "మృతుడైన తనకు జలతర్పణాదులు చేయరాదని" దశరథుడు నిషేధించినాడు. రావణవధ జరిగిన పిమ్మట శంకరుని దయవలన రామునకు పితృదేవుని దర్శనము లభించినది. అప్పుడు రాముడు ఆయనను "తండ్రీ! మీరు 'కైకమ్మను, ఆమె కొడుకును త్యజించుచున్నా'నని పలికితిరి. ఇప్పుడు వారికి ప్రసన్నులు కండు. ఆ ఘోరశాపము ఆ మాతాసుతులను స్పృశింపకుండునట్లు చేయుడు" (యుద్ధ. 122-25, 26) అని ప్రార్థించినాడు. తనకు ఇతరులపై ద్వేషము కలుగకుండుటకు వారు ప్రస్తుతము తనకు చేసిన అపకారమునుగాక, పూర్వము వారు తనకు చేసిన ఉపకారమును స్మరించును. అందువలననే కైకేయిని తనపట్టభంగము చేసిన సవతి తల్లిగా గాక, తన కుమారుని కంటె మిన్నగా ప్రేమించి, ఆదరించిన నాటి తల్లిగనే రాముడు ఆమెను తలంచినాడు. కాబట్టి ఆమెపై రామునకు ద్వేషము జనించలేదు. తనకు అపకారము చేసినవారిపై ద్వేషము, వైరము లేకపోవుట, వారిని నిందింపకపోవుటయే గాక, తన సమక్షములో ఇతరులు వారిని నిందించినను రాముడు సహింపడు. సీతాలక్ష్మణ సమేతుడై రాముడు పంచవటిలో నివసించుచున్న దినములలో ఒకరోజు ప్రసంగవశమున భరతుని సౌశీల్యమును శ్లాఘించుచూ లక్ష్మణుడు కైకేయి క్రౌర్యమును ప్రస్తావించినాడు. ఆ మాతృనిందను సహింపక రాముడు లక్ష్మణునితో "నాయనా! లక్ష్మణా! పినతల్లి కైకేయిని ఎట్టి పరిస్థితులలోను నిందింపరాదు. ఇప్పుడు భరతుని గూర్చియే ప్రసంగింపుము" (అర. 16-37) అని ఆయనను నివారించినాడు. దీనినిబట్టి రాముడు ఇతరుల దోషములను గర్హింపకుండుట, గర్హింపనీయకపోవుట మాత్రమే గాక వారి గుణములకు హర్షించు ఉత్తమ స్వభావము కలవాడు అని విశదమగుచున్నది. పరుల దోషములందు రమించుట, వారి దోషములను, వారిని గర్హించుట అను స్వభావము లేని కారణమున రామునిలో వైరభావము జనించుటకు అవకాశము లేకపోయినది.

అడవిలో ఉన్నను, అయోధ్యలో ఉన్నను రామునకు ధర్మానుసరణమే ప్రధానము. ధర్మప్రధానుడగు రామునకు అధర్మమే వైరి. అంతేగాని తన కెవరిమీదను వైయక్తిక శత్రుత్వము లేదు. మునిజనకంటకులైన రాక్షసులు, ధర్మవిరోధులగుట వలననే రామునకు శత్రువులయిరి. ధర్మస్థాపన చేయుట తన విధిగా తలంచిన రాముడు దండకారణ్యములో రాక్షస సంహారమునకు పూనుకొనినాడు. ఈ విషయమునే రాముడు ఖరునితో "రాక్షసుడా! లోకమునకు కీడుకోరువారిని, ఘోరపాపాచరణము చేయువారిని చంపుటకే రాజానతితో వచ్చితిని" (అర. 29-10) అని తన స్థితిని చెప్పినాడు. అట్లే అధర్మాచరణము చేయు వాలిని కూడా వధించినాడు. "నేను ధర్మస్థాపన చేయుచున్నాను. వైయక్తిక రాగద్వేషములకందు తావు లేదు"

**(న వయం స్వవశేస్థితాః**-కిష్కిం. 18-37)

అను భావముతో, విశ్వాసముతో ఉన్నాడు కావుననే వాలినిందా వాక్యములకు కుపితుడు కాలేదు. అట్లే తాను చేసిన వాలిదండనా విధానము కూడా ధర్మబద్ధమైనదిగా తలంచుట చేతనే పశ్చాత్తాపము చెందలేదు-

**"న మే తత్ర మనస్తాపో నమన్యుర్హరియూథప!"** (కిష్కిం. 18-38).

చేసిన పాపమునకు దండన అనుభవించి విగత కల్మషుడయిన వాలిపై జాలి ఉన్నది గాని, ద్వేషము లేదు. వాలిపై నున్న దయ చేతనే అంగదునిని కిష్కింధా రాజ్యమునకు యువరాజుగా అభిషేకింప చేసినాడు. ఈ విచారణమును బట్టి రామునకు అధర్మము

పై శత్రుభావమున్నది కాని, శిక్షననుభవించుట ద్వారా విగత కల్మషులైన వ్యక్తులపై ద్వేషము గాని, శత్రుభావముగాని లేదని స్పష్టమగుచున్నది.

రామరావణులకు శూర్పణఖా కారణముగా వైరమేర్పడినది. తన తమ్ముడు, అంతపాలుడు అయిన ఖరుని, అతని అనుయాయులగు రాక్షసులను చంపుట వలనను, తన చెల్లెలు శూర్పణఖను వికృతరూపను చేసి పరాభవించుట వలనను, రావణుడు రామునిపై పగబూనెను. తన శరణార్థులగు మునులకు శత్రువయి, వారిని రాక్షసులచేత హింసింపచేయుట వలననూ- "నా ఆదేశానుసారము అరణ్యములో స్థిరనివాసులైన రాక్షసులు ధార్మికులైన మునులను బాధించుచున్నారు"

**వసన్తి మన్నియోగేన నిత్యవాసం చ రాక్షసాః।**
**బాధామానా మహారణ్యే మునీన్ వైధర్మచారిణః॥** -అర. 36-4

అని రావణుడు మారీచునితో చెప్పను. రక్షణ లేని తన ఆశ్రమమునుండి తన భార్యను అపహరించి, తనను అవమానించుట వలనను, రామునకు రావణుడు శత్రువాయెను. ఇట్లు పరస్పరము శత్రువులగుటకు ఎవరి కారణము వారికి ఉన్నది. అయితే ఆ వైరభావము వారిరువురిలో వారి వారి సంస్కారములకు అనుగుణముగా పరిణమించినది. రావణునకు రాముడు "కోపించిన తండ్రిచే విడువబడినవాడు, దుశ్శీలుడు, కర్కశుడు, తీక్ష్ణుడు, లుబ్ధుడు, మూర్ఖుడు, ధర్మమును విడిచినవాడు, అధార్మికుడు, ప్రాణులకు హాని చేయుటలో ఆసక్తి కలవాడు, బలమున్నది గదా అని తన చెల్లెలను ముక్కుచెవులు కోసినవాడు, ఆయువు చెల్లినవాడు, క్షత్రియాధముడు"- (అర. 36-10,11,12)గ కన్పించినాడు. ఈ రావణుని వైరభావములో ద్వేషము, అసూయ ఉన్నవిగాన వైరి అయిన రామునిపై అసత్యములైన అవగుణములను ఆరోపించినాడు, నిందించినాడు. అట్లే "నీ కొఱకు సుందరి యగు సీతను తీసికొనివచ్చుటకు ఉద్యమించిన నన్ను లక్ష్మణుడు విరూపను చేసినాడు"-(అర. 34-20) అని శూర్పణఖ తన పరాభవమునకు కారణము చెప్పినను, (ఇది నిజము కాకపోయినను, నిజము తెలియని రావణునకు శూర్పణఖ ఈ మాట నిజమే అగును) తెలిసియు, "వైరము లేకనే నా చెల్లెలను విరూపనుగా చేసినాడు"

**(యేన వైరంవినాఽరణ్యే.... భగినీ మే విరూపితా** -అర. 36-12)

అని అసత్యమును చెప్పినాడు. అట్లే రామునిని "ఆడుదాని మాట పాటించి తల్లిదండ్రులను, మిత్రులను, రాజ్యమును విడిచినవాడు, తాపసుడు, దీనుడు, తేజోహీనుడు, అల్పమనుష్యుడు, మిధ్యాప్రవ్రాజి, పాపశీలుడు, మూర్ఖుడు" (అర. 40-4,5) అని తేలిక చేసి వదరినాడు. ఇట్లు అసత్యములు చెప్పుట, అసూయచే లేనిఅవగుణములను ఆరోపించుట, దూషించుట మొదలగు కార్యములను వైరమును ధర్మదృష్టితో చూడనివాడు, శత్రువు ఎడల ఉదాత్తముగా ప్రవర్తింపనేరనివాడు చేయును. రావణుని వైరభావము ద్వేషదూషితమై, నింద్యమై, మలినమయినదిగా పరిణమించినది.

సీతాహరణమునకు దుఃఖించుచున్న రాముడు తనకు శత్రువులగు రాక్షసులను నిందించలేదు, అసత్యారోపణములు చేయలేదు, అసత్యములు పలుకలేదు. సీతను రావణుడు అపహరించినాడని తెలిసినప్పుడు కూడ -"సీతను రావణుడెందుకు అపహరించినాడు? నేను వానికిచేసిన అపరాధమేమి? అతని పరాక్రమమెట్టిది? రూపమెట్టిది? వాని నివాసమెక్కడ?" (అర. 8-5,7)

ఇట్లు సీతాపహరణమునకు కారణమును, అపహరించినవాని వివరములను తెలిసికొనకోరినాడు. కాని వానిని ద్వేషించుటకాని, దూషించుటగాని చేయలేదు. ఏ సందర్భమునందయినను, రావణపరోక్షమున వానిని రాముడు నిందించలేదు. లంకాద్వార స్థితుడై అంగదుని ద్వారా రాముడు రావణునకు సందేశమును ఇట్లు పంపినాడు-"భ్రష్టశ్రీక! గతైశ్వర్య! ముమూర్ష! నష్టచేతన! బ్రహ్మదేవుని వరమువలన గర్వముతో దేవజాతులకు, మునులకు చేసిన పాపమునకు, నా భార్యాహరణము చేసినదానికి, నీకు దండన విధించుటకై దండధారినై, నీ లంకాద్వారస్థితుడనయి ఉన్నాను. సీతను ఒప్పగించి శరణు వేడనిచో ఈ లోకమును అరాక్షసముగా చేతును. అధార్మికుడవు, మూర్ఖసహాయుడవు, మనస్సు అదుపులో లేనివాడవు, నీవు రాజ్యమును ఇక క్షణకాలము కూడ పరిపాలింపజాలవు. కావున లంకానగరము నొకసారి చూచుకొనుము. జీవశ్రాద్ధము చేసికొనుము. ఇక నీ జీవితము నా చేతిలో ఉన్నది" (యుద్ధ 41-61,62,63,66). సమీప భవిష్యత్తులోనే తన చేతిలో రావణుడు "రాజ్యభ్రష్టుడు, ఐశ్వర్యహీనుడు, చావు కోరినవాడు, చేతనారహితుడు" కానున్నాడు కాన రాముడు వానిని సంబోధించి పలికిన మాటలు సత్యములే. ఇక్కడ కూడా రాముడు తనను క్షత్రధర్మానుసారముగా వాని పాపములకు దండన విధించు దండనాధికారిగా తలంచినాడు. రామునకు శరణాగత రక్షణమను వ్రతమున్నది. శత్రువయినను అంజలి ఘటించి, దీనుడై ప్రాణరక్షణార్థము ప్రపన్నుడై ఒక్కసారి "నీవా

దనని" (**తవాస్మీతి చ యాచతే**-యుద్ధ. 18-33) యాచించిన వానికి సర్వభూతములనుండి అభయమిచ్చుట రాముని వ్రతము. విభీషణునకు శరణు ఇచ్చు సందర్భములో సుగ్రీవుడు చేసిన శంకలన్నింటికి సమాధానము చెప్పుచు-"సుగ్రీవ! ఆ వచ్చినవాడు విభీషణుడైనను, లేదా స్వయముగా రావణుడే అయినను, వానికి అభయ మిచ్చితిని. వానిని తీసికొనిరమ్ము" (యుద్ధ. 18-34) అని తనకంత అపకారము చేసిన రావణునకైనను అభయమిచ్చుటకు రాముడు తన సంసిద్ధతను తెలిపినాడు. ఇప్పుడు అంగదుని ద్వారా రావణునకు "సీతను నాకిచ్చి శరణువేడినచో-

**(న చేత్ శరణమభ్యేషి మాముపాదాయ మైథిలీమ్**-యుద్ధ. 41-66)

లోకమును అరాక్షసముగ చేతునని సందేశము పంపినాడు. ఇట్టి స్థితిలో కూడ తన శరణాగత త్రాణవ్రతమును విస్మరింపక రావణునకు ఆ అవకాశమిచ్చినాడు. ఇక లోకమును అరాక్షసముగా చేతుననుటలో తనను శరణువేడక రావణుని కొఱకు పోరాడ వచ్చిన రాక్షసులననియే తెలిసికొనవలెను. ఏలనన విభీషణుని వలె భయపడినవారు ఎవరైనను వారికి అభయదానమున్నది గదా! అందువలన అభయదానము పొందిన రాక్షసులు జీవించియే ఉందురు. ఇంతకు ముందే విభీషణుని లంకాధిపతిగా అభిషేకించినాడు కాన (మహాపార్శ్వ, మహోదరులవంటి) మూర్ఖుల సహాయముతో, ఇంద్రియనిగ్రహములేక అధార్మికముగా సాగుచున్న రావణపాలనము లంకలో ఇక క్షణకాలము ఉండదనినాడు. ఇది నిశ్చయము కాన లంకనొకసారి చూచుకొనుమనినాడు. రాముడు పలికిన ఈ వీరాలాపములన్నియు అచిరకాలముననే నిజములయినవి.

రాముని ఈ వీరాలాపములలో సత్యము, ధర్మము, ఉదాత్తత ఉన్నది కాని ద్వేషదోషము లేదు. ధర్మదృష్టితోనే రాముడు రావణవధకు పూనినాడు. ధర్మశాస్త్రము- "పాపములు చేసిన మనుష్యులు రాజదండన పొంది పాపరహితులై, పుణ్యాత్ములవలె స్వర్గమును పొందుదురు" -(కిష్కిం. 18-33) అని చెప్పుచున్నది. ఈ శాస్త్రప్రమాణము తోడనే రావణుని పాపమునకు శిక్షగా దండన విధించి, వానిని పవిత్రునిగా చేయ నిచ్ఛ రామునకున్నది. "నా బాణములచే శాంతించి (మృతిచెంది) పిమ్మట పవిత్రుడ వగుదువు"

**మచ్ఛరైస్త్వం రణే శాంతస్తతః పూతో భవిష్యసి"**-(యుద్ధ. 41-69).

అట్లు పవిత్రుని చేసి "దేవతలు మహర్షులు, రాజర్షులు పోవు లోకములు" రావణునకు ప్రాప్తింపచేయు కోరిక ఉన్నది.

ఇక ప్రత్యక్షముగా రావణుని చూచి

**"అహో! దీప్తో మహాతేజా రావణో రాక్షసేశ్వరః"** (యుద్ధ. 59-26)

అని రావణతేజస్సుకు అబ్బురపడుచు "దేవదానవులలో ఇట్టి శరీరకాంతి లేదు. సూర్యుని తేజస్సువలె వీని తేజస్సు చూడ శక్యము కాకున్నది" (27,28) అని వాని తేజమును మెచ్చుకొనినాడు. ఇట్లు తనకు మహాపకారము చేసినవానిని, పాపాత్ముని, శత్రువుని చూచి, వాని గుణమును గుర్తించి, శ్లాఘించుట వైరమును కూడ ధర్మబద్ధముగా చూచు ధీరోదాత్తుడయిన రామునికే చెల్లినది. శక్త్యాయుధముచే లక్ష్మణుని మూర్ఛిలచేసిన రావణునిపై విక్రమించుచూ రాముడు -"ఈతడే జనస్థానవాసులు, అద్భుతరూపులు, వరాయుధధారులు అగు పదునాలుగువేల రాక్షసులను వధించినవాడు" (యుద్ధ. 59-133) అని తనను రావణునకు పరిచయము చేసికొనినాడు. ఆ రాక్షసులను రాముడు చంపినాడనియే గదా ఆయనపై రావణుడు పగబూనినది. అట్టి పగవాడు ఎదుట నిలబడి ఉన్నాడు. వానిపై రావణుడిప్పుడు పగతీర్చుకొనవచ్చును. 'తీర్చుకొను'మని ఉదాత్తముగ యుద్ధమున కాహ్వానించినట్లున్నవి రాముని మాటలు. ఇక తనకపకారము చేసిన రావణుడు చిరకాలమునకు తనకు దృష్టిగోచరుడయినాడు. వానిని చూచి రాముడు- "రాక్షసరాజా! నిలువుము, నిలువుము. నీవు నాకిట్టి అప్రియమొనర్చి ఎచటకు పోయి ముక్తుడవయ్యెదవు? (యుద్ధ. 59-130) అని రావణుని నిలువరించినాడు. తనకపకారము చేసిన శత్రువును ఎదుర్కొనుటకు విక్రమించుచున్నాడు. అట్లే తాను అపకారము చేసెనని తలంచుచున్న శత్రువునెదుటకు తానుగ పోయి, తాను వానికి చేసిన అపకారమును గుర్తు చేసి, వానిని పగదీర్చుకొనవచ్చునని హెచ్చరించినట్లుగా తనను రాముడు ప్రకటించుకొనినాడు. ఈ సన్నివేశము రాముని ధీరోదాత్త ప్రకృతిని వ్యక్తము చేయుచున్నది. ఇక రామరావణయుద్ధము ప్రారంభమైనది. రథియైన రావణునితో హనుమంతుని వాహనముగా చేసికొని రాముడు యుద్ధము చేసినాడు. రావణుడు హనుమంతుని గాయపరచటం చూచి రాముడు కోపముతో రావణుని రథ చక్రములను, గుఱ్ఱములను, ధ్వజమును, పతాకములను, సారథిని, రథమందున్న ఆయుధములను ముక్కలు ముక్కలు చేసెను. రావణుని కిరీటము పడద్రోసెను. ఒక వజ్రమువంటి బాణముతో రావణుని కొట్టెను. ఆ బాణపు దెబ్బకు రావణుడు చలించెను,

చేతిలోని వింటిని జారవిడిచెను. రావణుడు విషహీనమైన పామువలె, చల్లారిన నిప్పువలె, మాసిన సూర్యునివలె తేజోహీనుడై నిష్క్రియుడై అట్లే నిలబడిపోయెను. అట్టి శత్రువును చూచి రాముడు– "రాక్షసరాజా! నీవింక పొమ్ము. నీకు అనుజ్ఞ ఇచ్చుచున్నాను. నీవు యుద్ధము చేసి, చేసి అలసితివి. నీవు లంకకు పోయి, విశ్రమించి, రథమెక్కి ఆయుధధారివై రమ్ము. అపుడు నా బలమును చూచెదవు గాక!" (యుద్ధ. 59–143) అని సంభావించినాడు. అలసిపోయిన శత్రువును దయచూచువారు ఎందరుందురు? రథము విరిగిపోయినదని, గుఱ్ఱములు చచ్చినవని, సారథి హతుడైనాడని, ఆయుధములు లేవని, అలసిపోయినాడని జాలితలచి, చేజిక్కిన, చంపదగిన శత్రువును చంపక విడుచుచూ రాముడు దక్క అన్యులెవరు శత్రువునెడ నింత ఉదాత్తముగ ఉందురు?

తనవారిని చంపి, తనకు అపకారము చేసిన రామునిపై పగదీర్చుకొన రావణుడు నిశ్చయించినాడు. శత్రువుపై కోపమున్నది. కాని వానిని నేరుగా ఎదుర్కొనుటకు ధైర్యము లేదు.

**"క్రోధో మమామర్షాత్ ధైర్యస్యోపరివర్తతే"** (అర. 55–23).

రామునిని యుద్ధములో ఎదుర్కొనుట, లేదా రామపరోక్షమున సీతాహరణము చేయుట అను విషయములలోని గుణదోషములను, కర్తవ్యాకర్తవ్యములను విచారించి తుదకు సీతాపహరణమునకే నిశ్చయించినాడు. అనగా యుద్ధమున రాముని జయించుట దుర్ఘటమని తెలిసి రామునకు భయపడి నీచమగు పరదారచౌర్యమునకు పాల్పడినాడు. రావణుని ఎదిరించిన జటాయువు కూడా అతనితో "రామలక్ష్మణులకు నీవు భయపడినావు" (**తయోర్భీతో న సంశయః**–అర. 51–24) అని పలికినాడు. జటాయువును వధించి, సీతను తీసికొని భయముతో వడిగా పరిగెత్తుచున్న రావణునితో ఆమె "ఇంత త్వరగా పరిగెత్తుచున్నావు. ఇట్టి స్థితిలో ఏమి చేయనగును. ఒక ముహూర్తకాలము నిలచినచో నీవు బ్రతికి బయటపడవు" అని నిర్భయముగా నిందించినది. అకంపన, మారీచులచే రామపరాక్రమమును వినుటవలనను, ఖరాది రాక్షసవధ తెలియుట వలననూ రామపరాక్రమమునకు భయపడి, రాముని ఎదుటపడలేక, నీచమైనను, శూన్యాశ్రమము నుండి సీతను అపహరించినాడు. రాముని ఎదుర్కొను ధైర్యమునకంటె రామునిపై కోపము ముందుకు వచ్చుచున్నదని తానేఅంగీకరించినాడు. రామపరోక్షమున సీతను హరించుటలో తనకు మరియొక లాభమున్నదని తలచినాడు. "సీతాపహరణము చేసిన పిమ్మట భార్యావియోగముచే క్రుంగిపోయిన రామునిని సుఖముగా దెబ్బ తీయుదును"– (అర. 36–21), మఱియు కుంభకర్ణ, ఇంద్రజిదాదులు మహావీరులు మడిసిన పిమ్మట తన మూలబలమును రాముని పైకి పంపుతూ–"యుద్ధభూమిలో రామునిని ఒక్కనినే చుట్టుముట్టి చంపుడు.

**(ఏకం రామం పరిక్షిప్య సమరే హంతుం అర్హథ**–(యు. 94–4)

లేనిచో, (మీరట్లు రామునిని చంపలేనిచో) రామ శరీరమును మీ బాణములతో చీల్చితిరేని, (అట్లు బలహీనుడైన రామునిని రేపు జనులెల్ల చూచుచుండగా వధింతును" (యుద్ధ. 94–5) అని రాముని తేజోవధ జరిగిన పిమ్మట ఆయనను వధింపదలచినాడు. ఒక కుంభకర్ణుడో, ఇంద్రజిత్తో, మూలబలమో రామునిని చంపిన బాగుండునని కోరుకొనినాడు. అట్లుగాక తానే చంపవలసివచ్చుచో వేరు కారణములతో బలహీనుడైన రామునిని చంపదలచినాడు. ఇట్టివాడు రణభూమిలో ఒకవేళ రాముడు తనచే జిక్కిన రామునివలె ఉదాత్తముగ ప్రవర్తించునా? రక్షణలేని ఆశ్రమమునకు వచ్చి, నిస్సహాయయైన స్త్రీని అపహరించినవాడు, దుఃఖితుడై, తేజోహీనుడయి, నిరుత్సాహియైఉన్న శత్రువును వధింపదలచువాడు, అనృతములాడువాడు, అసూయాపరుడు, అధార్మికుడు, పాపాచార సమన్వితుడు నేరుగా శత్రువు నెదుర్కొన జంకువాడు, క్రూరుడు–అయిన వానికి శత్రువు ఎడల ధీరోదాత్తముగ ప్రవర్తించుటకు ధార్మికశక్తి ఎటనుండి వచ్చును?

రావణమరణమునకు దుఃఖించుచున్న విభీషణుని రాముడూఅడించినాడు. పిమ్మట రావణశవదహనమునకు అనుమతిని కోరిన విభీషణునితో రాముడు–మా వైరము రావణమరణముతో అంతమైనది. ఇప్పుడు రావణుడు నీకు ఎట్లో, నాకును అట్లే. వానికి సంస్కారమును చేయుము (యు. 114–10) అని పలికినాడు. ఇంతలో అంతఃపుర స్త్రీలు వచ్చి రావణశవము చుట్టును మూగి విలపించిరి. పట్టపుదేవి మందోదరి పరమ దయనీయముగా, సత్యప్రలాపములతో విలపించినది. పిమ్మట స్త్రీలను పట్టణమునకు పంపించి, రావణశవమునకు దహనసంస్కారములు చేయుమని రాముడు విభీషణుని కోరినాడు. అప్పుడు విభీషణుడు–

**"రామస్యైవానువృత్త్యర్థముత్తరం ప్రత్యభాషత"** –(యు. 114–93).

రామునననుసరించుచూ రామునకు రావణునిపై గల శత్రుభావము ననుసరించుచూ–అనగా రాముడు రావణుని "క్రూరునిగా, పరదారరతాత్మునిగా, పాపాత్మునిగా" తలంచి నట్లుగా తానును తలంచి వానికి దహనసంస్కారములు చేయుటకు తిరస్కరించినాడు. ఇట్లు తిరస్కరించుట రావణుని గూర్చి రామహృద్గత భావము నెఱుగ కోరియే అని ఊహింపవచ్చును. ముందు తాను కోరగా కాదనలేక రావణదహన సంస్కారమునకుఅనుమతి ఇచ్చినను, అది నిజముగా రాముడు హృదయపూర్వకముగా ఇచ్చినదో, మోమోటమితో ఇచ్చిన అనుమతియో తెలిసికొనుటకు విభీషణుడు తానుకూడ రావణుని శత్రువుగా భావించి, ద్వేషము ప్రకటించి, దహనసంస్కారము చేయ తిరస్కరించినాడు. రాముడు రెండు మాటలవాడు కాడు–**"రామో ద్విర్నాభిభాషతే"**– (అయో. 18–30). కావున అదే మాటను మఱల పలికినాడు ః

**మరణాంతాని వైరాణి నిర్వృత్తం నః ప్రయోజనమ్।**
**క్రియతామస్య సంస్కారో మమాప్యేష యథా తవ॥** (యుద్ధ–114–101)

(మా పగ శత్రు మరణముతో అంతమయినది. మా ప్రయోజనము నెరవేరినది.

ఇక వానికి దహన సంస్కారములు చేయుము. ఇప్పుడు అతడు నీకు ఎట్లో–అనగా సోదరుడో, నాకును అట్లే) ద్వేషము లేని రాముని పగ ఆయన మనస్సును వీడిపోవుట దీనివలన అవగతమగుచున్నది. రామునకు రావణునిపై అతడు మరణించు వరకు వైరమున్నది. కాని తదనుబంధియైన ద్వేషము లేదు. ఇప్పుడు–మరణించిన తర్వాత, ఆ వైరము కూడ లేదు. వైరభావము లేకపోవుటయే గాక భ్రాతృభావమున్నది. రాముని వైరభావము ధర్మబద్ధమై, పునీతమై, భాతృభావముగా పరిణమించినది.

## *REFERENCE*

అందరు రామునివలె పగను మరణాంతమని తలంచలేరు. భీముడు దుర్యోధనుని పడగొట్టిన పిమ్మట కూడా పగ తీరక వాని తలను కాలితో తన్నినాడు. భీముడు జీవించి ఉన్నంతకాలము కౌరవులపై పగ ఆయనలో జీవించియే ఉన్నది.

**"గౌ గౌరితి పురా మంద! ద్రౌపదీమేకవాసనమ్।**
**యత్సభాయాం హసన్నస్మాన్స్తదా వదసి దుర్మతే॥**
**తస్యావహాసస్య ఫలమద్య త్వం సమవాప్నుహి॥**
**ఏవముక్త్వా స వామేన పదా మౌలిముపాస్పృశత్।**
**శిరశ్చ రాజసింహస్య పాదేన సమలోడయత్॥** *(మ.భా.శల్య–59అ.4,5 శ్లో.)*

గ్రీకు నాటకకర్త సోఫెకాల్స్ వ్రాసిన 'ఎంటిగాన్' అను విషాదాంత నాటకములో ఒక సన్నివేశమున్నది. 'ఎంటిగాన్' ఇద్దరు సోదరులలోఒకరు ప్రభువు 'క్రయన్'కు వ్యతిరేకముగా పోరాడి మరణించినాడు. ఒకరు అతనికి అనుకూలుడై యుద్ధములో మరణించినాడు. అనుకూలుని శవసంస్కారమునకు అంగీకరించి, ప్రతికూలుని దేశద్రోహిగా తలచి వాని సంస్కారమును నిషేధించినాడు. ఎంటిగాన్ తన సోదరుడు అనామకుడు కాదనియు, వాని శవసంస్కారము చేయుట తన పవిత్రకర్తవ్యమనియు, దానికి ప్రజల ఆమోదము (వారు రాజభయముచే పెదవి విప్పకపోయినను) కలదనియు అని, వానిని ప్రతిఘటించినది. 'చనిపోయిన ప్రతివారికి సంస్కారము జరుగవలసినదే. దీనిని పవిత్రమైనదిగా, దోషరహితమైనదిగా అందరు తలంతురు" అని 'క్రయన్'ను ఒప్పించుటకు ప్రయత్నించినది. దానికి క్రయన్ *"Never, Once an enemy, never a friend, not even after death"*– "ఒకసారి శత్రువయినవాడు స్నేహితుడగుట అసంభవము. మరణించిన తర్వాత అయినను సరే" అని ఉద్ఘాటించినాడు. లోకములో ఇట్టివారు, ఇంకనూ క్రూరులుండవచ్చును. వారు పగతో జీవించి, పగతో మరణింతురు. రాముని వైరము తద్భిన్నముగా ఉన్నది. శత్రువు మరణానంతరము ఆయన వైరమును పాము కుబుసము విడిచినట్లు వదలివేసినాడు. ద్వేషరహిత వైరమగుటచే, మరణానంతరము శత్రువును సోదరునిగా తలంచినాడు. పగ ప్రేమగా పరిణమించినది. ఇట్టి వైరభావము లోకమున కాదర్శము. అందుకే రామునిని "శత్రువులకు కూడ ప్రీతిపాత్రుడు" అని స్తుతించిరి. (**రిపూణామపివత్సలమ్**–అయో. 21–6)

*Sophocles "Antigone"- Translated by Robert Fagles (Lines 584-589)*